# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily


సంపుటి: 20 | సంచిక: 285 | వరంగల్ | సోమవారం, 17 ఆగస్టు 2026 | పేజీలు: 6




# అక్రమాలకు అధికారుల వత్తాసు!


ములుగు జిల్లా మంగపేట మండలం వాడగూడెం ఇసుక ర్యాంపులో అక్రమాలపై వరుసగా ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకుని నిర్ణీత రుసుములు చెల్లించిన లారీ యజమానుల నుంచి అదనంగా రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ ఇప్పటివరకు సమగ్ర విచారణ చేపట్టకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం మౌనం వహించడంపై లారీ యజమానులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇసుక ర్యాంపుల్లో అక్రమాలకు తావులేకుండా టీజీఎండీసీ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. ఆన్‌లైన్ బుకింగ్, చెల్లింపులు, వేబిల్ జారీ, వాహన సామర్థ్యానికి అనుగుణంగా లోడింగ్ వంటి అంశాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. అయితే వాడగూడెం ర్యాంపులో అధికారికంగా రుసుములు చెల్లించిన తర్వాత కూడా అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై పీవో స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలు తేల్చాల్సి ఉన్నా.. ఇప్పటివరకు అలాంటి చర్యలు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. అదనపు వసూళ్లు జరుగుతున్నాయా? ఒకవేళ జరిగితే ఆ డబ్బులు ఎవరి వద్దకు వెళ్తున్నాయి? ర్యాంపులో లారీ లోడింగ్ కోసం ప్రత్యేకంగా డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారు? అన్నది అధికారులు తేల్చాల్సి ఉంది.

*– అక్షరశక్తి, నిఘా ప్రతినిధి*



- వాడగూడెం ర్యాంపుపై మౌనమెందుకు..?!
- అదనపు వసూళ్ల ఆరోపణలపై పీవో విచారణ ఏది?
- వీడియోలు వెలుగులోకి వచ్చినా పట్టించుకోరా?
- ఓవర్‌లోడింగ్, వేబిల్లులపై తనిఖీలు ఎక్కడ?
- టీజీఎండీసీ అధికారుల తీరుపై అనుమానాలు

5





## సోషల్ జస్టిస్ చేసింది కేసీఆర్‌నే

- మూడేళ్లుగా ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది
- మా పథకాలు, నిర్మాణాలకు రంగులు వేస్తున్నారు.
- వాళ్ళవి 420 హామీలు
- దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి

అక్షరశక్తి,హనుమకొండ: తెలంగాణే శ్వాసగా, ధ్యాసగా ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసినదే అసలైన సోషల్ జస్టిస్ అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు.

5

## విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటమే

**పవర్ జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్**

రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్ల సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యాలు వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని పవర్ జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ హెచ్చరించారు. ఈ నెల 19న హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధా ఎదుట నిర్వహించనున్న మహాధర్నా పోస్టర్‌ను సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో జేఏసీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

*- అక్షరశక్తి,హనుమకొండ*

2



## యువ క్రికెటర్ విశ్వనాథ్ వైష్ణవ్ కుటుంబ సభ్యులకు పరామర్శ



**అక్షరశక్తి,వరంగల్:** తూర్పు నియోజకవర్గంలోని ఎస్ఆర్ఆర్ తోటకి చెందిన ప్రముఖ యువ క్రికెట్ క్రీడాకారుడు విశ్వనాథ్ వైష్ణవ్ ఇటీవల అకాల మరణం చెందడం పట్ల బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైష్ణవ్ మరణవార్త తెలుసుకున్న గంట రవికుమార్ ఈరోజు బీజేపీ నాయకులతో కలిసి వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. వారిని ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఎంతో ప్రతిభ గల యువ క్రికెటర్ చిన్న వయసులోనే మరణించడం క్రీడారంగానికి, ఆ కుటుంబానికి తీరని లోటని ఆయన అన్నారు. వైష్ణవ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల శ్రవణ్, కరీమాబాద్ మండల ప్రధాన కార్యదర్శి వంచనగిరి రాజ్ కుమార్, ఆడెపు రవిరాం పాల్గొన్నారు.

## హనుమకొండలో ఉచిత నైపుణ్య శిక్షణ

**అక్షరశక్తి,హనుమకొండ:** జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో 30 ఏళ్లలోపు చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఈ నెల 18న ఉచిత నైపుణ్య శిక్షణ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, డిప్లొమా పూర్తిచేసిన వారు అర్హులు. ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లో ఉన్న ఎంసీసీ స్కిల్ సెంటర్లో ఉదయం 10.30 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుంది. కమ్యూనికేషన్, టీమ్‌వర్క్, రెజ్యూమే తయారీ, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, డిజిటల్ అవగాహన, వర్క్‌ప్లేస్ ఎటికెట్, ఫ్రంట్ ఆఫీస్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. మరిన్ని వివరాలకు: 7893394393 సంప్రదించాలని తెలిపారు.

## గురజాల జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**అక్షరశక్తి,గురజాల:** జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కీర్తిశేషులు మంచిక కుమారస్వామి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు విద్యార్థులకు ప్రొజెక్టర్, స్క్రీన్‌లు, బెంచీలను అందజేశారు. అలాగే కుమారస్వామి స్మారకార్థం నిర్వహించిన జనరల్ నాలెడ్జ్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొని మంచిక కుమారస్వామి కుటుంబం అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమానికి సహకరించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, మంచిక లక్ష్మీనారాయణ, జనగాం కుమారస్వామి, మంచిక రమేష్‌తో పాటు ఉపాధ్యాయ బృందానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటమే

- **పవర్ జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్**



**అక్షరశక్తి,హనుమకొండ:** రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్ల సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యాలు వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని పవర్ జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ హెచ్చరించారు. ఈ నెల 19న హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధా ఎదుట నిర్వహించనున్న మహాధర్నా పోస్టర్‌ను సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో జేఏసీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యుత్ కార్మికుల సమస్యలను అనేకమార్లు ప్రభుత్వం, యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదన్నారు.

ఆర్టిజన్ కార్మికులు ఎన్నో ఏళ్లుగా సంస్థల్లో పనిచేస్తున్నప్పటికీ వారికి రావాల్సిన కనీస హక్కులు కూడా కల్పించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్టాండింగ్ ఆర్డర్ నిబంధనల ప్రకారం ఏడేళ్లు దాటిన ఆర్టిజన్లకు ప్రమోషన్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఒకే సంస్థలో ఒకే సర్వీస్ రూల్ ఉండాల్సి ఉండగా రెండు రకాల సర్వీస్ రూల్స్ అమలు చేస్తూ ఆర్టిజన్ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, ఎన్‌పీడీసీఎల్‌లో పనిచేస్తున్న అన్మ్యాండ్ కార్మికులను వెంటనే ఆర్టిజన్లుగా గుర్తించి వారికి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ గడువు పూర్తయినప్పటికీ కొత్త కమిటీని ఏర్పాటు చేయకపోవడం సరికాదని శ్రీధర్ అన్నారు. వెంటనే పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేసి ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న కింది స్థాయి పోస్టులను భర్తీ చేయాలని, కార్మికులకు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఈపీఎఫ్ కార్మికులకు పరిమితి లేని వైద్య సౌకర్యం అందించాలని డిమాండ్ చేశారు. వైటీపీఎస్‌ను ప్రైవేటీకరించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని, లేకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే విద్యుత్ సంస్థల్లోని ఉద్యోగులు, ఆర్టిజన్లు, కార్మికులు, అన్మ్యాండ్ కార్మికులందరూ ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకుంటారని శ్రీధర్ స్పష్టం చేశారు. ఈ నెల 19న హైదరాబాద్ విద్యుత్ సౌదా ఎదుట నిర్వహించే మహాధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్లు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం, యాజమాన్యాలు వెంటనే పవర్ జేఏసీ నాయకులను చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ జేఏసీ చైర్మన్ రమణారావు, జేఏసీ నాయకులు సామ్యా నాయక్, నార్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు, మల్లికార్జున్, పి. మహేందర్‌రెడ్డి, కుమారస్వామి, కిరణ్, ఎం. బుచ్చయ్యగౌడ్, సీహెచ్. ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి.. ఆడబిడ్డలతో ఆటలా..?

- **కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా కలెక్టర్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ధర్నా..**
- **పాల్గొన్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి,మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్..**





**అక్షరశక్తి, హనుమకొండ:** పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించి ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొని ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచేందుకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పథకాల అమలులో నిర్లక్ష్యం చేస్తూ అర్హులైన లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. "పేదింటి ఆడబిడ్డల సంక్షేమంతో ఆటలాడటం సరికాదు. ఇచ్చిన హామీలను అమలు చేయాలి. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించి అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలి" అని డిమాండ్ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని, పథకాల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆధునిక సాంకేతికతతో పరిశోధనలు

**అక్షరశక్తి,కేయూ క్యాంపస్:** ఆధునిక పరిశోధనలో విస్తృతమైన డేటాను శాస్త్రీయంగా విశ్లేషించి, ప్రయోగాత్మక ఫలితాలను మరింత కచ్చితంగా ధ్రువీకరించేందుకు అధునాతన సాఫ్ట్‌వేర్ సాధనాల వినియోగం ఎంతో కీలకమని కాకతీయ యూనివర్సిటీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్ లైఫ్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్ అండ్ అల్లైడ్ డిసిప్లిన్స్ ఆధ్వర్యంలో, సమన్వయకులు ఆచార్య ఎన్. ప్రసాద్, అదనపు సమన్వయకులు డాక్టర్ టి. శాస్త్రి పర్యవేక్షణలో విశ్వవిద్యాలయ కంప్యూటర్ సెంటర్‌లో ప్రారంభమైన వారం రోజుల కార్యశాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముఖ్యంగా ఔషధ పంపిణీ వ్యవస్థల రూపకల్పనలో అణువులు, పదార్థాల లక్షణాలను అధ్యయనం చేసేందుకు మాలిక్యులర్, మెటీరియల్ మోడలింగ్ సాఫ్ట్‌వేర్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఔషధ ఆవిష్కరణ రంగంలో కంప్యూటర్ ఆధారిత ఔషధ రూపకల్పన (CADD) సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశోధకులు, విద్యార్థులు విస్తృతంగా వినియోగించుకోవాలని హైదరాబాద్ అడ్వెంట్ ఇన్ఫర్మాటిక్స్ సీఈఓ, ఇతర బాధ్యులు సురోజిత్ సాధు, షమ్షీర్ సింగ్, దీపక్ శర్మ సూచించారు. మోల్సాఫ్ట్ సాఫ్ట్‌వేర్ టూల్స్ ద్వారా అణు నిర్మాణాల విశ్లేషణ, ఔషధ అణువుల రూపకల్పన, వాటి పరస్పర చర్యల అధ్యయనం వంటి అంశాలను ఆచరణాత్మకంగా నేర్చుకోవచ్చని తెలిపారు. రుసా నోడల్ అధికారి ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ రుసా నిధులతో ప్రయోగశాలలకు నూతన సాంకేతిక పరిజ్ఞానం, సాఫ్ట్‌వేర్‌ను సమకూర్చామని, పరిశోధకులు వాటిని సమర్థవంతంగా వినియోగించి నాణ్యమైన పరిశోధనలు చేపట్టాలని అన్నారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు, పరిశోధకులు పట్టు సాధించాలన్నారు. పరిశోధనలో భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం తదితర విభాగాల మధ్య సమన్వయం ద్వారా కచ్చితమైన, విశ్వసనీయమైన ఫలితాలను సాధించవచ్చని ఆచార్య వెంకట్రామరెడ్డి పేర్కొన్నారు. పరిశోధకులు తమ ఫలితాలను అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ప్రతిష్ఠాత్మక పరిశోధనా జర్నల్స్‌లో ప్రచురించే దిశగా కృషి చేయాలని సూచించారు. రుసా నిధులతో సమకూర్చిన ఆధునిక సాఫ్ట్‌వేర్‌ను వివిధ శాస్త్ర విభాగాల పరిశోధకులు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఆచార్య ప్రసాద్, డాక్టర్ శాస్త్రి మాట్లాడుతూ వారం రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యశాల కొనసాగుతుందని, శిక్షణ పూర్తిగా ప్రయోగాత్మకంగా ఉంటుందని తెలిపారు.





# వందేమాతర గేయాన్ని అవమానిస్తే సహించేది లేదు

**గంట రవికుమార్**



**అక్షరశక్తి,వరంగల్:** చౌరస్తాలో బీజేవైఎం ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీల వైఖరికి నిరసనగా భారీ ఆందోళన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ, జాతీయ గేయం వందేమాతరం ఆలాపన కొనసాగుతున్న సమయంలో కాంగ్రెస్ అగ్రనేతలు అసౌకర్యంగా భావించి గేయాన్ని నిలిపివేయాలని నిర్వాహకులకు సైగలు చేయడం సిగ్గుచేటన్నారు. స్వాతంత్ర్య సమరంలో కోట్లాది మందికి స్ఫూర్తినిచ్చిన వందేమాతరాన్ని అవమానించడం కాంగ్రెస్ పార్టీ వైఖరికి నిదర్శనమని, దేశభక్తి, జాతీయ భావాలపై కాంగ్రెస్ నాయకులకు గౌరవం లేదని విమర్శించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు 'ఈ దేశంలో ఉండాలంటే వందేమాతరం పాడాల్సిందే' అంటూ నినాదాలు చేశారు. దేశ గౌరవాన్ని, జాతీయ చిహ్నాలను కించపరిచే చర్యలను బీజేపీ సహించబోదని, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎర్రగొల్ల భరత్ వీర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎలగందుల శ్రవణ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# నాలా, ఎల్ఆర్ఎస్ అనుమతులు లేకుండా భూమి రిజిస్ట్రేషన్

**చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు**

**అక్షరశక్తి,హనుమకొండ:** కాజీపేట మండలం శాయంపేట గ్రామంలోని సర్వే నంబర్ 306/సీ/1లో 400 గజాల భూమిని నాలా పర్మిషన్, ఎల్ఆర్ఎస్ అనుమతులు లేకుండా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారంటూ కాయిత ఇంద్రసేనారెడ్డి వరంగల్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జీపీఏ డాక్యుమెంట్ నంబర్ 12629/2026, సేల్‌డీడ్ డాక్యుమెంట్ నంబర్ 12981/2026 ద్వారా లావాదేవీలు జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.
తన భార్య మినుకురి తిరుమల పేరుతో 2021లో డాక్యుమెంట్ నంబర్ 20260/2021 ద్వారా సర్వే నంబర్ 306లోని ప్లాట్ నంబర్లు 50, 59లో 700 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు ఇంద్రసేనారెడ్డి తెలిపారు. అయితే గత నెల నుంచి బొల్లం మాధవి తన అనుచరులతో కలిసి తమ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి కాంపౌండ్ వాల్ తొలగించి బోర్‌వెల్ వేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. అడ్డుకునేందుకు వెళ్లిన తమను దూషిస్తూ, తనకు ఉన్న వైకల్యాన్ని కూడా పట్టించుకోకుండా దాడికి పాల్పడ్డారని, దీంతో తమకు ప్రాణ భయం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.
భూ భారతి రికార్డుల్లో సదరు భూమి నివాస స్థలంగా నమోదై ఉన్నప్పటికీ నాలా పర్మిషన్, ఎన్‌ఓసీ, ఎల్ఆర్ఎస్ లేకుండానే రిజిస్ట్రేషన్ జరిగిందని ఇంద్రసేనారెడ్డి ఆరోపించారు. బొల్లం మొండయ్య వారసులుగా పేర్కొంటున్న బొల్లం కమలమ్మ, బొల్లం జంపన్నలు ఓగిలిశెట్టి మాధవికి జీపీఏ ఇచ్చారని, దాని ఆధారంగా సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. సంబంధిత రిజిస్ట్రేషన్‌లో ప్రభుత్వ నిబంధనలు, భూ వినియోగ మార్పు, లేఅవుట్ అనుమతులకు సంబంధించిన నిబంధనలు పాటించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.
ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, డాక్యుమెంట్ నంబర్ 12981/2026 రిజిస్ట్రేషన్ చట్టబద్ధతను పరిశీలించాలని ఇంద్రసేనారెడ్డి కోరారు. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసిన బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తన స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించిన వారిపై కేసు నమోదు చేసి రక్షణ కల్పించాలని పోలీస్ కమిషనర్‌ను విజ్ఞప్తి చేశారు.



# వరంగల్ నగరంలో చోరీల కలకలం

- **తాళం వేసిన రెండు ఇళ్లలో దొంగల చేతివాటం**
- **కరీమాబాద్ ఉర్సు భగత్‌సింగ్‌నగర్ కాలనీలో ఘటన..**

**అక్షరశక్తి,వరంగల్**: నగరంలో వరుస చోరీలు కలకలం రేపుతున్నాయి. తాళం వేసి ఉన్న రెండు ఇళ్లను లక్ష్యంగా చేసుకున్న దొంగలు విలువైన బంగారం, వెండి ఆభరణాలను అపహరించినట్లు సమాచారం. కరీమాబాద్ ఉర్సు ప్రాంతంలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. బాధితులు 100కు సమాచారం అందించడంతో అజాంజాహి మిల్స్ కాలనీ పోలీసులు వెంటనే ఘటనా స్థలాలకు చేరుకుని పరిశీలించారు. ఒక ఇంట్లో సుమారు 27.5 గ్రాముల బంగారం, 66 తులాల వెండి చోరీకి గురైనట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతానికి చెందిన ఓ ఇంట్లోనూ ఆభరణాలు మాయమైనట్లు పోలీసులు ప్రాథమిక ఆధారాలను సేకరించారు. మరో ఇంట్లో చోరీకి గురైన వస్తువుల వివరాలను పోలీసులు బాధితుల నుంచి తెలుసుకుంటూ దర్యాప్తు చేస్తున్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి దొంగలు పక్కా ప్రణాళికతో చోరీలకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలాల్లో ఆధారాలను సేకరించిన పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. రెండు చోరీ ఘటనలపై కేసు నమోదు చేసి నిందితుల ఆచూకీ కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# కేటాయించిన ఇళ్లలో వెంటనే నివసించాలి

**కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**అక్షరశక్తి, హనుమకొండ:** నిరుపేద కుటుంబాలకు సొంత ఇళ్లు ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో వెంటనే నివసించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సూచించారు. సోమవారం శాయంపేటలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల బ్లాక్‌లను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా బ్లాక్‌లను సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఇప్పటివరకు ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే తమకు కేటాయించిన ఇళ్లలో నివసించాలని కోరారు. అన్ని బ్లాక్‌లలో అవసరమైన సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. మొత్తం 19 బ్లాక్‌లకు గాను ప్రస్తుతం 6 బ్లాక్‌లకు విద్యుత్ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. మిగతా బ్లాక్‌లకు కూడా వారం రోజుల్లోగా విద్యుత్ సౌకర్యం కల్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో హౌసింగ్ పీడీ సిద్దార్థ్ నాయక్, ఆర్అండ్‌బీ ఈఈ, హౌసింగ్ ఏఈ, డీఈలు పాల్గొన్నారు.





# విలేఖరిపై అర్ధరాత్రి దాడి..

## ఇంట్లో సామాగ్రి ధ్వంసం



**అక్షరశక్తి, చిట్యాల:** ఆర్‌బీ న్యూస్ విలేఖరి రవితేజపై ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు ముసుగులు ధరించి దాడికి పాల్పడిన ఘటన చిట్యాల మండలంలో కలకలం రేపింది. సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో నిందితులు రవితేజ ఇంట్లోకి చొరబడి విచక్షణారహితంగా దాడి చేసినట్లు సమాచారం. దాడి సమయంలో ఇంట్లో మహిళలు ఉన్నప్పటికీ నిందితులు వారిని పట్టించుకోకుండా రవితేజపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు బాధితులు తెలిపారు. అనంతరం ఇంట్లోని సామాగ్రిని ధ్వంసం చేసి భయాందోళనకు గురిచేసినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై చిట్యాల మండల జర్నలిస్టు అధ్యక్షుడు కాట్రేవుల ఐలయ్య, కమిటీ సభ్యులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టు ఇంటిపైకి చొరబడి దాడి చేయడం, ఆస్తులను ధ్వంసం చేయడం దారుణమని వారు పేర్కొన్నారు. బాధిత విలేఖరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. దాడికి గల కారణాలు, నిందితుల వివరాలను పూర్తిస్థాయిలో విచారించి, దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని చిట్యాల మండల జర్నలిస్టులు డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టి, విధులు నిర్వహించే వారికి తగిన రక్షణ కల్పించాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కోరారు.

# టీఎన్జీవో ఆధ్వర్యంలో పాత పెన్షన్ సాధన సభ: ఆకుల రాజేందర్.



**అక్షరశక్తి, హనుమకొండ:** నాంపల్లి లోని టీఎన్జీవో కేంద్ర సంఘం భవన్ లో జరిగిన టీఎన్జీవో కార్యవర్గ సమావేశంలో హనుమకొండ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుసైని ఆధ్వర్యంలో వరంగల్ ఉమ్మడి జిల్లా లోని హనుమకొండ లో సెప్టెంబర్ 19 న ఓల్డ్ పెన్షన్ సాధన మరియు పి ఆర్ సి సాధన సభ రాష్ట్రంలోనే మొదటగా తీసుకుంటున్నామని ఈ సభ ద్వారా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేసేలా, ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకు వచ్చేలా సభను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు భూక్యా రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలిగా సాగంటి

## "అక్షర శ్రీ" గౌరవ పురస్కారం అందుకున్న సాగంటి మంజుల

**అక్షరశక్తి, హనుమకొండ:** విశ్వసాహితీ కళావేదిక జాతీయ సాహితీ సంస్థకు తెలంగాణ రాష్ట్ర లలిత కళల విభాగానికి అధ్యక్షురాలిగా తెలంగాణ హనుమకొండకి చెందిన అధ్యాపకులు, రచయిత్రి, కవయిత్రి, చిత్రకారిణి, సాంగటీస్ ఆర్ట్స్ అకాడమీ అధినేత అయిన డా. సాగంటి మంజులని నియమిస్తున్నట్టు జాతీయ అధ్యక్షురాలు రమావతి తెలిపారు... నిన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని తాడేపల్లి గూడెం లో జరిగిన విశ్వ సాహితీ కళా వేదిక ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో మంజుల తెలుగు సాహిత్య రంగానికి చేస్తున్న సేవకు గాను మాస్ట్రో గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా "అక్షర శ్రీ" విశిష్ట గౌరవ పురస్కారంతో పాటు రాష్ట్ర అధ్యక్షురాలిగా నియామక పత్రాన్ని మంజులకు అందిస్తూ మంజుల కళలకు చేస్తున్న సేవలకు మరింత గుర్తింపునిస్తూ ఈ నియామకం జరిగిందని రమావతి మంజులను అభినందించారు.



# తెలంగాణలో రైస్ మిల్ పరిశ్రమను కాపాడాలి

## బాదం ప్రవీణ్



**అక్షరశక్తి,ములుగు:** తెలంగాణలో రైస్ మిల్ పరిశ్రమను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ములుగు జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కోరారు. వివిధ అభివృద్ధి పనుల నేపథ్యంలో ఆదివారం ములుగు జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జిల్లా రైస్ మిల్లర్లతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. రైతులకు సన్న ధాన్యం సాగును ప్రోత్సహిస్తూ క్వింటాకు రూ.500 బోనస్ అందించడంతోపాటు మిల్లర్లను భాగస్వాములను చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే ధాన్యం సేకరణ నుంచి బియ్యం ఎఫ్‌సీఐకి అప్పగించే వరకు మిల్లర్లు అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. మిల్లులకు ధాన్యం సరఫరా చేసిన వేగంతో ఎఫ్‌సీఐ బియ్యాన్ని తీసుకోకపోవడంతో ధాన్యం ఎక్కువ కాలం నిల్వ ఉండి వెయిట్ లాస్, డ్యామేజ్, డీప్ కలర్ వంటి సమస్యలు వస్తున్నాయని ప్రవీణ్ తెలిపారు. దీంతో బియ్యం నాణ్యతను మెరుగుపరిచేందుకు స్టార్ట్స్ మిషన్లు వినియోగించాల్సి వస్తోందని, అదనపు విద్యుత్ వినియోగం, లేబర్, మిషనరీ ఖర్చులతో మిల్లర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 90 రోజుల తర్వాత బియ్యం రికవరీ శాతంపై ఉన్న నిబంధనలను సడలించాలని, మిల్లింగ్ చార్జీలు పెంచాలని, 124 హెచ్‌పీ నుంచి 199 హెచ్‌పీ వరకు ఎల్‌టీ విద్యుత్ కేటగిరీలోనే కొనసాగించేలా టారిఫ్‌ను సవరించాలని కోరారు. పాత గన్నీ సంచుల చార్జీల విషయంలోనూ మిల్లర్లకు ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ధాన్యం, బియ్యం నిల్వలకు సరిపడా గోదాములు నిర్మించాలని, గోదాముల కొరతతో ఇతర జిల్లాలకు బియ్యం తరలించడం వల్ల మిల్లర్లపై పడుతున్న రవాణా భారాన్ని తగ్గించాలని బాదం ప్రవీణ్ కోరారు. అకాల వర్షాలు, ప్రకృతి విపత్తుల కారణంగా తడిసిన, మొలకెత్తిన ధాన్యంతో తయారయ్యే బియ్యం ఎఫ్‌సీఐలో తిరస్కరణకు గురవుతున్నందున, అలాంటి బియ్యాన్ని థర్డ్ పార్టీలకు విక్రయించేలా నిబంధనలు సవరించాలని సూచించారు. రైస్ మిల్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి మిల్లర్లను ఆదుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వినతుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**అక్షరశక్తి,హనుమకొండ:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన వినతుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజావాణి కి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై వినతులను అందించగా కలెక్టర్ స్వీకరించారు. ప్రజావాణిలో పాల్గొన్న జిల్లా అధికారులను ప్రజలు అందించిన వినతులపై పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన వినతుల పరిష్కార చర్యలపై వర్చువల్ విధానంలో తహసిల్దార్లతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సజావుగా నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు తప్పనిసరిగా ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్ లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ప్రజావాణి వినతుల పరిష్కారానికి చర్యలు చేపట్టి పెండింగ్ లో ఉండకుండా చూడాలన్నారు. అధికారులు హాస్టల్స్ లో మౌలిక వసతులు పరిశీలించి సంబంధిత వివరాల నివేదికను అందజేయాలన్నారు. హాస్టల్స్ లో వసతుల కల్పనకు అంచనా వేసి ఇంజనీరింగ్ అధికారులకు పంపించాలన్నారు. హాస్టల్స్ లో పురోగతిలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఇన్చార్జి అదనపు కలెక్టర్( స్థానిక సంస్థలు) శేషాద్రి, డిఆర్‌ఓ శ్రీనివాస్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, డిఆర్డిఓ మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విలువైన పుస్తకాలను గ్రంథాలయాలకు అందించాలి



**అక్షరశక్తి,హనుమకొండ:** కాకతీయ ప్రభుత్వ కళాశాల లో ఎం.ఏ. తెలుగు విద్యార్థుల ప్రయోజనార్థం సీనియర్ జర్నలిస్ట్, విశ్రాంత ఉపాధ్యాయులు తిరునగరి నరేందర్ అందించిన తెలుగు సాహిత్యానికి సంబంధించిన విలువైన పుస్తకాలను సోమవారం విద్యార్థులకు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ గుర్రపు శ్రీనివాస్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో 'ఐ లవ్ రీడింగ్-ఐ లైక్ లైబ్రరీ' వ్యవస్థాపకులు, ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకం జ్ఞానాన్ని అందించడంతో పాటు ఆలోచనా విధానాన్ని, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే గొప్ప సాధనమన్నారు. తెలుగు భాష, సాహిత్యాన్ని అభ్యసించే విద్యార్థులకు ప్రామాణికమైన పుస్తకాలు అందుబాటులో ఉండటం అభినందనీయమన్నారు. ఇళ్లలో ఉపయోగం లో లేకుండా మూలన పడివున్న విలువైన పుస్తకాలను తూకానికి వేసి విక్రయించకుండా అవసరమైన విద్యార్థులకు, గ్రంథాలయాలకు, పఠన కేంద్రాలకు అందించాలని నిమ్మల శ్రీనివాస్ కోరారు. ఒకరి ఇంట్లో నిరుపయోగంగా ఉన్న పుస్తకం మరో విద్యార్థికి జ్ఞానదీపంగా మారుతుందని పేర్కొన్నారు. తమ వద్ద ఉన్న పుస్తకాలను ఎక్కడ అందించాలో తెలియని వారు 9949709866 నంబర్‌కు ఫోన్ చేస్తే వాటిని అవసరమైన వారికి చేరేలా సమాచారాన్ని అందిస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ గుర్రపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎం.ఏ. తెలుగు విద్యార్థుల సాహిత్య అధ్యయనం, పరిశోధనకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని, పుస్తకాలను అందించిన తిరునగరి నరేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, సమత, మహేందర్, లైబ్రేరియన్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ జస్టిస్ చేసింది కేసీఆర్‌నే

- మూడేళ్లుగా ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది
- మా పథకాలు, నిర్మాణాలకు రంగులు వేస్తున్నారు.
- వాళ్ళవి 420 హామీలు
- దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి



**అక్షరశక్తి,హనుమకొండ:** తెలంగాణే శ్వాసగా, ధ్యాసగా ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసినదే అసలైన సోషల్ జస్టిస్ అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల 60 ఏళ్ల కలను కేసీఆర్ సాకారం చేశారని, దళితబంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలతో పేద, బడుగు, బలహీన వర్గాలను ఆదుకున్నారని వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. బీసీ, మైనారిటీల కోసం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యకు ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. తొలి డిప్యూటీ సీఎంగా దళిత నేతకు, తొలి స్పీకర్‌గా బీసీ నేతకు అవకాశం కల్పించడంతో పాటు అన్ని వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన ఘనత కేసీఆర్‌దేనని తెలిపారు. అయితే రేవంత్‌రెడ్డి పాలనలో సోషల్ జస్టిస్ ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరకాల పర్యటనపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. సీఎం పర్యటనతో పరకాలకు ఒరిగిందేమీ లేదని, రైతులకు యూరియా అందించడం, నియోజకవర్గానికి సాగునీరు తీసుకురావడం వంటి సమస్యలపై ముఖ్యమంత్రి మాట్లాడలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు రంగులు వేసి కాంగ్రెస్ ప్రభుత్వం తామే చేసినట్లుగా ప్రచారం చేసుకుంటోందని అన్నారు. టెక్స్‌టైల్ పార్కు, వంద పడకల ఆసుపత్రి వంటి అభివృద్ధి పనులను బీఆర్ఎస్ హయాంలోనే తీసుకొచ్చామని, గత మూడేళ్లలో పరకాలలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

పరకాల నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ వెజ్-నాన్ వెజ్ మార్కెట్, దామెర చెరువు సుందరీకరణ, చిరు వ్యాపారుల కోసం నిర్మిస్తున్న కాంప్లెక్స్ వంటి పనులను పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. సీఎం సభ కోసం చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించి వారిని ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. మహిళా సంఘాల సభ్యులను సభకు రావాలని ఒత్తిడి చేసి, రాకపోతే జరిమానా విధిస్తామని బెదిరించారన్న ఆరోపణలను కూడా ఆయన చేశారు. రైతులకు యూరియా అందించలేని అసమర్థ ప్రభుత్వం ఇదని, ప్రజల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు.

కేసీఆర్ కుటుంబంపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను చల్లా ధర్మారెడ్డి తప్పుబట్టారు. రాజకీయ విమర్శలు చేయడంలో హద్దులు పాటించాలని, కుటుంబాల జోలికి వెళ్లడం సరికాదని హితవు పలికారు. కేసీఆర్ వంద జన్మలు ఎత్తినా ఆయనను ఏమీ చేయలేరని, ఆయన చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఆనవాళ్లను కూడా చెరపలేరని అన్నారు. అక్కంపేట గ్రామం ఇప్పటికీ రెవెన్యూ గ్రామంగా మారిందా లేదా అనే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అధికార బలంతో ఏది మాట్లాడినా చెల్లుతుందనే భ్రమలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని దాస్యం వినయ్ భాస్కర్ హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రారంభిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని, ఓఆర్ఆర్ వంటి ప్రాజెక్టుల విషయంలోనూ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రజలను మూడేళ్లుగా వంచించిన రేవంత్‌రెడ్డి తాను సోషల్ జస్టిస్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం పర్యటనకు జిల్లా మంత్రి సురేఖ హాజరుకాకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అంతర్గత పరిస్థితులకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. హామీలను నెరవేర్చకపోతే ప్రజలు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, హన్మకొండ, పరకాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అక్రమాలకు అధికారుల వత్తాసు!

- వాడగూడెం ర్యాంపుపై మౌనమెందుకు..?!
- అదనపు వసూళ్ల ఆరోపణలపై పీవో విచారణ ఏది?
- వీడియోలు వెలుగులోకి వచ్చినా పట్టించుకోరా?
- ఓవర్‌లోడింగ్, వేబిల్లులపై తనిఖీలు ఎక్కడ?
- టీజీఎండీసీ అధికారుల తీరుపై అనుమానాలు



**అక్షరశక్తి, నిఘా ప్రతినిధి:** ములుగు జిల్లా మంగపేట మండలం వాడగూడెం ఇసుక ర్యాంపులో అక్రమాలపై వరుసగా ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకుని నిర్ణీత రుసుములు చెల్లించిన లారీ యజమానుల నుంచి అదనంగా రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ ఇప్పటివరకు సమగ్ర విచారణ చేపట్టకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం మౌనం వహించడంపై లారీ యజమానులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇసుక ర్యాంపుల్లో అక్రమాలకు తావులేకుండా టీజీఎండీసీ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. ఆన్‌లైన్ బుకింగ్, చెల్లింపులు, వేబిల్ జారీ, వాహన సామర్థ్యానికి అనుగుణంగా లోడింగ్ వంటి అంశాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. అయితే వాడగూడెం ర్యాంపులో అధికారికంగా రుసుములు చెల్లించిన తర్వాత కూడా అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై పీవో స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలు తేల్చాల్సి ఉన్నా.. ఇప్పటివరకు అలాంటి చర్యలు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. అదనపు వసూళ్లు జరుగుతున్నాయా? ఒకవేళ జరిగితే ఆ డబ్బులు ఎవరి వద్దకు వెళ్తున్నాయి? ర్యాంపులో లారీ లోడింగ్ కోసం ప్రత్యేకంగా డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారు? అన్నది అధికారులు తేల్చాల్సి ఉంది. ఇందుకోసం ర్యాంపు రోజువారీ రికార్డులు, ఆన్‌లైన్ బుకింగ్ వివరాలు, వేబిల్లులు, లారీ ప్రవేశ-నిష్క్రమణ రికార్డులు, సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**ఓవర్‌లోడింగ్‌పై పర్యవేక్షణ ఏది?**

వాహన సామర్థ్యానికి మించి ఇసుక లోడ్ చేయకూడదు. అయినప్పటికీ వాడగూడెం ర్యాంపులో ఓవర్‌లోడింగ్ జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సామర్థ్యానికి మించి ఇసుక తరలించడం వల్ల రహదారులు దెబ్బతినడంతోపాటు ప్రమాదాలకూ అవకాశం ఉంటుంది. మరోవైపు నకిలీ వేబిల్లుల సాయంతో రాత్రివేళల్లో ఇసుక తరలిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ర్యాంపులో రోజూ ఎన్ని లారీలు ప్రవేశిస్తున్నాయి? ఎన్ని వాహనాలకు లోడింగ్ చేస్తున్నారు? ఎన్ని వేబిల్లులు జారీ అవుతున్నాయి? వేబిల్‌లో పేర్కొన్న పరిమాణానికే ఇసుక లోడ్ చేస్తున్నారా? అన్న వివరాలను అధికారులు తనిఖీ చేయాల్సి ఉంది. రికార్డులు, సీసీ కెమెరా ఫుటేజీలు, ఆన్‌లైన్ లావాదేవీలను సరిపోలిస్తే ఓవర్‌లోడింగ్, అక్రమ రవాణాపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**చర్యలు తీసుకోకపోవడంపై ప్రశ్నలు.....**

వాడగూడెం ర్యాంపులో జరుగుతున్న వ్యవహారాలపై ఫిర్యాదులు, వీడియోలు అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ చర్యలు కనిపించకపోవడం పలు ప్రశ్నలకు దారితీస్తోంది. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. నిరాధారమైతే విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలి. కానీ విచారణ లేకుండా మౌనం వహించడం వల్లే అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పారదర్శకంగా ఇసుక అందించాలన్న లక్ష్యం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత టీజీఎండీసీ అధికారులపై ఉంది. వాడగూడెం ర్యాంపుపై ప్రత్యేక తనిఖీ నిర్వహించి అదనపు వసూళ్లు, ఓవర్‌లోడింగ్, వేబిల్లుల వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని లారీ యజమానులు, స్థానికులు కోరుతున్నారు. లేకపోతే ర్యాంపులో నిబంధనలు అమలవుతున్నాయా.. పర్యవేక్షణ కేవలం కాగితాలకే పరిమితమైందా? అన్న సందేహాలు మరింత బలపడే అవకాశం ఉంది.

## జర్నలిజంలో ఉపాధి అవకాశాలు



**అక్షరశక్తి,హనుమకొండ:** సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం "జర్నలిజంలో ఆధునిక ధోరణులు" అంశంపై కార్యక్రమం నిర్వహించారు. జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ పత్రికలు, ప్రసార, సామాజిక మాధ్యమాల విస్తరణతో జర్నలిజం రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి మాట్లాడుతూ డిజిటల్ మీడియాతో పాటు వివిధ మాధ్యమాల్లో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యవక్త ఆకేరు మీడియా సంస్థ అధిపతి సుధాకర్ జర్నలిజంలో నూతన ధోరణులు, సవాళ్లు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ మంద శ్రీనివాస్, డాక్టర్ శ్రీధర్ కుమార్, డాక్టర్ శేషు, డాక్టర్ బిక్షపతి, డాక్టర్ విజయకుమార్, బండి శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా



**అక్షరశక్తి,పరకాల:** పరకాల పట్టణ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో పరకాల పాలిటెక్నిక్ కళాశాల ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ శక్తి పాలసీని వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఎస్‌బీటీఈటీ బోర్డును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో హాస్టళ్లు, ల్యాబ్‌లు, భవనాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని, అధ్యాపకులు, సిబ్బంది సర్వీస్ నిబంధనలకు రక్షణ కల్పించాలని కోరారు. పాలిటెక్నిక్ కళాశాలలను వైఐఎస్‌యూలో విలీనం చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కళ్యాణ్ డిమాండ్ చేశారు. విద్యార్థులు, కళాశాలల సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బొచ్చు ఈశ్వర్, పరకాల పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్, నాయకులు ప్రశాంత్, నాగరాజ్, అభినవ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా ఇండిపెండెన్స్ డే కరాటే ఛాంపియన్‌షిప్‌లో హన్మకొండ విద్యార్థుల హవా



**అక్షరశక్తి,హన్మకొండ:** న్యూఢిల్లీలోని తల్కతోర ఇండోర్ స్టేడియంలో ఆగస్టు 7, 8, 9 తేదీల్లో నిర్వహించిన ఆల్ ఇండియా ఇండిపెండెన్స్ డే కరాటే ఛాంపియన్‌షిప్-2026లో హన్మకొండకు చెందిన కరాటే విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు విజయాలు సాధించారు. గోపాల్‌పూర్‌లోని చిల్లీ థ్రిల్ అకాడమీకి చెందిన విద్యార్థులు సీకోకై షోటోర్యా కరాటే ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులను అభినందిస్తూ అకాడమీలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్ఐసీ సీనియర్ మేనేజర్ హనుమంతు, స్పోర్ట్స్ కరాటే డూ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని సదానందం హాజరై విజేతలను అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో హన్మకొండ విద్యార్థులు ప్రతిభ చాటడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. క్రీడల్లో రాణించేందుకు విద్యార్థులు పట్టుదలతో సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరాటే విద్యార్థుల తల్లిదండ్రులు, కరాటే అభిమానులు పాల్గొని విజేతలకు అభినందనలు తెలిపారు. విద్యార్థులకు నిరంతరం శిక్షణ అందిస్తూ జాతీయ స్థాయిలో విజయాలు సాధించేలా కృషి చేసిన కరాటే కోచ్ పాలకుర్తి పాపయ్యను ఘనంగా సన్మానించారు.

# జర్నలిస్టుపై దాడి ప్రజాస్వామ్యంపై దాడే



**అక్షరశక్తి,భూపాలపల్లి:** చిట్యాల మండలంలో ఆర్‌బీ న్యూస్ రిపోర్టర్ పుల్ల రవీందర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయడాన్ని ఖండిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా జర్నలిస్టులు సోమవారం నిరసన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన అనంతరం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న రవీందర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయడంతో పాటు, అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆయన భార్యపై కూడా దాడి చేసి ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారని జర్నలిస్టు సంఘాల నాయకులు తెలిపారు. భూ వివాదానికి సంబంధించిన వార్తను కవరేజ్ చేసినందుకు కొందరు రవీందర్‌పై కక్ష పెంచుకుని ఈ దాడికి పాల్పడ్డారని జర్నలిస్టు సంఘాల నాయకులు ఆరోపించారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుపై ఇంట్లోకి చొరబడి దాడి చేయడం దారుణమని, ఇది కేవలం వ్యక్తిపై జరిగిన దాడి కాదని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. దళిత జర్నలిస్టుపై జరిగిన ఈ ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, హత్యాయత్నం తదితర కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. జర్నలిస్టులకు భద్రత కల్పించడంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సమ్మయ్య, క్యాతం సతీష్‌కుమార్, ఎడ్ల సంతోష్, పావుశెట్టి శ్రీనివాస్, ప్రవీణ్, సామల శ్రీనివాస్‌తో పాటు జర్నలిస్టులు తడక సుధాకర్, అంబాల సంపత్, సుధాకర్, దేవేందర్, భూమిరెడ్డి, జగన్, మధు, బండ మోహన్, భూపాల్, కోడి ఐలయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా నిల్వ ఉంచిన 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

**అక్షరశక్తి,భూపాలపల్లి:** మొగుళ్లపల్లి మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 5 క్వింటాళ్ల ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని సీసీఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు సీసీఎస్ పోలీసులు మొగుళ్లపల్లి మండల కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి మొగుళ్లపల్లి మండలానికి చెందిన తూర్పాటి సమ్మక్క (50), భర్త సమ్మయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ పేదలకు అందించాల్సిన ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న సుమారు 5 క్వింటాళ్ల బియ్యాన్ని, నిందితురాలిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, ఇతర ప్రాంతాలకు రవాణా చేయడం, అక్రమంగా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థను దుర్వినియోగం చేసే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, అక్రమాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.



# రయ్యాల శ్రీధరాచార్యులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

**అక్షరశక్తి,వరంగల్:**

వరంగల్ కు చెందిన ప్రముఖ వ్యాఖ్యాత, గాయకులు, తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మాసూమ్ అలీలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న రయ్యాల శ్రీధరాచార్యుల జన్మదినం సందర్భంగా శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి 2000-01 బ్యాచ్ పూర్వ విద్యార్థులు గెట్ టు గెదర్ నిర్వహించి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో శ్రీధరాచార్యుల బోధనల ద్వారా పొందిన స్ఫూర్తిని, సాహిత్య, సాంస్కృతిక పోటీలకు విద్యార్థులను తన సొంత ఖర్చులతో తీసుకెళ్లి బహుమతులు సాధించేలా ప్రోత్సహించిన విషయాలను పూర్వ విద్యార్థులు గుర్తుచేసుకున్నారు. అలాగే ఆయన తమకు పాటలు, పద్యాలు నేర్పిన తీరును స్మరించుకున్నారు. కార్యక్రమానికి ప్రత్యక్షంగా హాజరు కాలేకపోయిన పూర్వ విద్యార్థులు సమూహ వాట్సాప్ వీడియో కాల్ ద్వారా పాల్గొని శ్రీధరాచార్యులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చెరుకుపల్లి సూర్య జడ్సన్ (రవి), అందె పాణి, కల్లెపల్లి శివ, ఎం.డి. ఇనాయత్ పాషా, చింతకాయల సురేష్, పోతన రమ, కవిత, రాధిక, అనిత, దేవిక, పద్మ, మామిడాల కిరణ్ కుమార్, అనూష తదితరులు పాల్గొన్నారు.



# నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యుల మర్యాదపూర్వక భేటీ



**అక్షరశక్తి,హన్మకొండ క్రైమ్:** వరంగల్ కమిషనరేట్‌లో ఇటీవల ఎన్నికైన నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు సోమవారం పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్‌ను సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కలను అందజేశారు. ఎన్నికల నోడల్ అధికారి, అదనపు డీసీపీ ప్రభాకర్‌రావు నూతన కార్యవర్గ సభ్యులను సీపీకి పరిచయం చేశారు. అధ్యక్షుడిగా కె. కరుణాకర్, ఉపాధ్యక్షులుగా బి. సతీష్, బి. శరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇ. వీరభద్రరావు, సంయుక్త కార్యదర్శిగా టి. నరేష్ తదితరులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ ఎన్. శ్వేత నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. పోలీస్ సిబ్బంది సమస్యలపై తక్షణమే స్పందించి, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పోలీస్ అధికారుల సంఘం సిబ్బందికి అండగా నిలుస్తూ స్ఫూర్తిదాయకంగా పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు నాగయ్య, సదయ్య, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు, నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# జీతాల పెంపునకు కృషి చేసిన ఏఐటీయూసీకి రూ.లక్ష విరాళం



**అక్షరశక్తి, హైదరాబాద్:** తెలంగాణ టూరిజం శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నెలవారీ వేతనాల పెంపునకు కృషి చేసిన ఏఐటీయూసీకి తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ యూనియన్ తరపున రూ.లక్ష నిధిని అందజేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి ఉద్యోగుల తరపున రూ.లక్ష నగదును ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు చాడ వెంకట్‌రెడ్డి, అధ్యక్షులు వి.ఎస్. బోస్‌కు అందజేశారు. ఉద్యోగుల జీతాల పెంపునకు కృషి చేసిన సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ సీనియర్ నాయకులు డాక్టర్ కే. నారాయణ, చాడ వెంకట్‌రెడ్డి, వి.ఎస్. బోస్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ నాయకులు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులకు సబ్బు రాజమౌళి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారి వేతనాల పెంపునకు సహకరించిన నాయకులకు ఉద్యోగుల తరపున ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సీపీఐ పార్టీ కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల మహా ధర్నా పోస్టర్ విడుదల



**అక్షరశక్తి, వరంగల్:** ఈ నెల 19 వ తేదీన విద్యుత్ సౌధ లో జరగబోయే మహా ధర్నా కార్యక్రమాన్ని పురస్కరించుకొని ధర్నా గోడ పత్రికను ములుగు రోడ్డు 220kv సబ్ స్టేషన్ ఆవరణంలో టీజీపీఏ జాక్ నాయకులు పాల్గొని ఆవిష్కరించారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేపడుతున్న ఈ మహా ధర్నాకి భారీ సంఖ్యలో ఉద్యోగులందరూ తరలి రావాలని జాక్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, కుమారస్వామి, శ్రీనివాస్ , యుగేందర్, రవి, విజయ్, భరత్, నరేష్, నాదం, సజిని, రూబియా, ఇతర ఇంజనీర్స్ వివిధ సంఘాల సభ్యులు మరియు కార్మికులు పాల్గొన్నారు.

# మల్కాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జంగం రవి యాదవ్

**అక్షరశక్తి,జనగామ:** జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జంగం రవి యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జంగం రవి యాదవ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, గ్రామ సర్పంచ్ ఎడవెల్లి లావణ్య మల్లారెడ్డి, ఉప సర్పంచ్ పశుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని రవి యాదవ్ పేర్కొన్నారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు.



Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.